6

# దగ్ధజీవితం

'ఈ పాడు బ్రతుకెందుకో' - అనుకుంది పార్వతి.

మనసంతా ఖాళీ. ఆలోచనలు లేవు. ఆనందం లేదు. ఆశలు లేవు. ఏమీ లేవు... ఒట్టి బండ బతుకు... నిట్టూర్చింది.

బయట కురుస్తున్న వర్షంచప్పుడు లయబద్ధంగా విడివడకుండా వినబడుతూనే ఉంది. కిటికీలో నుండి చూచింది. వీధిలో డాంబర్ రోడ్డుపై టపటపా పడ్తున్న చినుకులు లైటు వెలుతుర్లో చిత్రంగా మెరుపు తీగల్లా మెరుస్తున్నాయి.

నిశ్శబ్దంలో- వాన చప్పుడు ఎంత బాగుందో... తన జీవితంలో కన్నీటి చప్పుడో-ప్చ్.

ఎందుకో భోరున ఏడ్వాలనిపిస్తోందామెకు.

అప్రయత్నంగానే తన తొడపై తలపెట్టి నిద్రపోతున్న ఐదేళ్ళ కూతురువంక ఆప్యాయంగా చూచింది.

ప్రక్కనే బీడీల చేట. చేటలో కత్తిరించిన తునికి ఆకులు. పొగాకు కుప్ప. ప్రక్కన దారపు రీలు, కత్తెర, బీడీలు చేసిచేసి ఒళ్ళంతా పొగాకు వాసన అలుముకుపోయింది. ఆకు కత్తిరించి కత్తిరించి వ్రేళ్ళు కాయలు కాసిపోయినై. ఐనా.... "నువ్వు సినిమా యాక్టర్లెగె ఉంటవే పార్వతీ" అంటుంది జానకమ్మ. ఆ మాట జానకమ్మ అనకున్నా తను అందంగానే ఉందని తెలుసు పార్వతికి. కానీ అందమంతా అడవిగాచిన వెన్నెలో, కొమ్మమీదనే ఎండిపోయే పువ్వో ఔతోందని కూడా తెలుసు-

'డబ్బు... డబ్బు... డబ్బు తెస్తాన్నేను. డబ్బుంటే ఎంతో సుఖపడొచ్చు మనం'- అని అరబ్ దేశాలకు డ్రైవర్ పని చేయడానికెళ్ళిన భర్త జ్ఞాపకమొచ్చాడామెకు. మూడేండ్లు దాటింది. డబ్బు పంపుతాడు.... తనక్కాదు. అతని అన్నకు పంపుకుంటాడు. అన్న దాన్ని బ్యాంక్‌లో వేసి దాస్తాడట. తమ్ముడొచ్చినంక మంచి ఇల్లుకొనిచ్చి ఉంచుతాడట. ఎప్పుడైనా వచ్చి "నువ్వు బీడీలు చేసిన డబ్బుంటే ఇయ్యి- అవి కూడా బ్యాంకులనే ఏస్త" అంటడు.

బ్రతుకులో ఎంతో విలువైన వయసు, ఆనందం పోయిన తర్వాత ఈ మనుషులు డబ్బుతో ఏం జేస్తారో-అనుకుంది పార్వతి.

ఆ మధ్య తన అత్తవారి ఊరికెళ్ళినపుడు ఎవరో అంటూండగా వింది తను- "లక్ష్మన్ దేశంబోయి వాళ్ళన్నకు రెండు లక్షలు పంపించాడట. వచ్చినంక గా బీడీలు

చేసే పెండ్లామెందుకు. ఓ చదువుకున్న పిల్లను చూచి మళ్ళీ పెండ్లి చేస్త మా తమ్మునికి అని వాళ్ళన్నంటాండు" అని.

మనుషులకు డబ్బు ముదిరితే మదమస్తది అనుకుంది పార్వతి.

ఎప్పుడో రెండు మూడు నెలలకోసారి రెండు మూడు లైన్లు ఉత్తరం రాస్తాడు. ఎవరితోనైనా చదివించుకుంటే "నేను బాగున్న, మీరు బాగున్నారా" అని ఉంటది అంతే.

వర్షం కురుస్తూనే ఉంది బయట.

లోపల... కన్నీళ్ళ వర్షం ప్రారంభమై.

ప్రక్క గదిలో గాజుగ్లాసు భళ్ళున క్రిందపడి పగిలిన చప్పుడై... ఉలిక్కిపడింది పార్వతి.

"పార్వతీ... పా....ర్వ..."

తడబడే మాట... పళ్ళూడిపోయిన బోసినోటి నుండి... తాగిన నాలుక తడబడ్తూ... మాటలు లుంగలు చుట్టుకుపోతూ...

...తన తండ్రి... తన దిక్కు... ప్రస్తుతం తన ఇంటి యజమాని... సారా తాగుడుకు బానిస... ప్రతి పూటా ఏదో ఓ రకంగా తాగడానికి ప్రయత్నించే బుద్ధిలేని మనిషి. ఒకసారి తనను డబ్బడుక్కుని, మరోసారి ఇంకెక్కడైనా అప్పుచేసి... ఎవరికైనా టోపీ వేసి...

ఎంత మందలించినా... తిట్టినా వినడు. "ఇక రేపో మాపో పోయేటోన్ని నా నోట్లె మన్నెందుకు పోస్తవే పార్వతీ" అంటాడు. పాపమనిపిస్తుంది.

ఈయన బలహీనతను ఆసరాగా తీసుకుని నర్సింలు భలేగా మనిషిని తన బుట్టలో వేసుకున్నాడు. తాగే వానికి తాగించేవాడు దేవుడు. నర్సింలిప్పుడు నాన్న దృష్టిలో దేవుడు. ఐతే ఆ తాగేదేదో బయట ఎక్కడన్నా తాగిరాక ఇంట్లోనే ఈ దుకాణమేమిటో అర్థం కాదు.

ఆ నర్సింలుగాడు ఓ కులపోడు కాదు. సరిజోడు వయసువాడూ కాదు. ఎంతో పూర్వపరిచయమున్న వాడూ కాదు. వాడు తన ఎదుటపడ్డప్పుడల్లా చూచే చూపు... ఆ చూపుల్లోని ఆకలి... పరమ అసహ్యం. వాడు తన తండ్రితో చేసే దోస్తీ వెనుక ఏదైనా దుర్బుద్ధి ఉన్నదా అన్న అనుమానం. ఓసారి తండ్రితో ఆ విషయం చూచాయగా అంటే 'వాడసోంటోడు కాడు' అన్నాడు. తాగేవాడికి తాగించేవాడు... కదా,

"పా..ర్వతీ.." కూరుకుపోతున్న తండ్రి కంఠం.

తొడపై పడుకున్న కూతురును నెమ్మదిగా ప్రక్కకు జరిపి, పైనున్న బీడీల చాటను క్రిందపెట్టి చీరసింగుల్లో పడిన పొగాకును దులుపుకుంటూ లేచి నడిచింది.

ప్రక్క గదిలోకి రాగానే దృశ్యాన్ని చూసి విభ్రాంతురాలై.

తండ్రి కుర్చీలో నుండి బోర్లాపడి ఉన్నాడు నేలపైన. అతని తలప్రక్కనే పగిలిన గాజు గ్లాసు ముక్కలున్నాయి. ఒక గాజుముక్క కణతదగ్గర దిగి... రక్తం ఎర్రగా... ధారగా కారుతోంది. స్పృహ కోల్పోతున్నట్టుగా ఒగరుస్తూ నిశ్శబ్దంలోకి జారుకున్నాడు మనిషి.

ఎదురుగా గోడకానుకుని కూర్చుని నర్సింలు. అతని కళ్ళలో దాడి చేయబోయే పులిలో కనబడే కాఠిన్యత. ఆమె అతన్ని పట్టించుకోలేదు. వంగి తండ్రి గాయాన్ని చేతితో తాకబోయింది.

"పార్వతీ... నీ అయ్యకు ఇంతవరకు ఎంత ఖర్చుపెట్టానో తెలుసా... మూడువందల డెబ్బయ్ రూపాయలు. ఊర్కే పిచ్చోన్నై పెట్టలేదు. ముసలినా కొడుకు నోరు మూయించి... నీ సంగతి... చెప్పిండా నీ తండ్రి..."

ఆమె తీక్షణంగా అతనివంక చూచింది. మాట్లాడలేదు.

చేయి పట్టుకున్నాడు.... "లొల్లి పెట్టకు. నీ మొగడు ఎట్లాగూ నిన్నిడిచి ఏడికో పోయిండు. ఏండ్లాయె. పిల్ల పసిది. వీడు మన లోకంల లేడు. గుట్టు చప్పుడు కాకుండా వచ్చేయ్.. ఇట్లనే అప్పుడప్పుడు నడిపిద్దాం".

మగస్పర్శ... ఎన్నో ఏండ్ల తర్వాత ఏదో జలదరింపు... గాలిలో రెపరెపలాడే కాగితపు ముక్కలా తన్నుకుని తన్నుకుని,

సముద్రాన్ని గుప్పిట్లో దాచుకుంటున్నట్లుగా కళ్ళు మూసుకుని నిట్టూర్చి.... ఫెడేళ్ళమని చెంపపై చెళ్ళుమనిపించింది.

నర్సింలు ఊగిపోయాడు. ఉగ్రుడైపోయాడు.

ఆమెను ఇంకా దగ్గరకు లాక్కుని పొదివిపట్టుకునేందుకు ప్రయత్నించాడు.

"మంచి మాటకు చెప్తున్నాను. రా"

భరించువాడు భర్త... ఎక్కడున్నావురా ఓ భర్తా.

"వచ్చెయి నాతో... లేకుంటే ముందే ఎరకలోన్ని నేను. ఏం జేస్తనో నాకే తెల్వది"

కట్టుకున్నభార్యను ఎక్కడో... ఈ జనారణ్యంలో విడిచి డబ్బు వేటలో పారిపోయిన ఓ మగడా ఎక్కడ్రా నువ్వు. భార్య పరాయిపాలైపోయిన తర్వాత నీ డబ్బును ఏంజేసుకుంటవ్-

నర్సింలు ముఖంమీద తుపుక్కున ఉమ్మేసింది.

చిందులు తొక్కాడు. చీరను లాగబోయాడు. ముఖంపై ముఖంపెట్టి పెదవులను కొరకబోయి-

ప్రక్కనున్న సారాయి సీసా చేతికందింది. ఫడేళ్ళుమని తలపై బాదింది. నొసలు చిట్లి..... అదను చూచుకుని వీధిలోకి పరుగెత్తింది.

వీధి వర్షంలో తడిచిపోతూ, నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా... ఊరి బయట ఉన్న. తమ ఇండ్ల పరిసరాల్లో ఎవరుంటారు... దూరంగా ఎరుకలి గూడెం. ఇటు ప్రక్క ఎవరెవరివో ఇండ్లు.

నర్సింలు కూడా వీధిలోకి వచ్చి... ఆమెను లాగుతూ...

అరుస్తోందామె... "లచ్చక్కా.... ఓ మల్లవ్వా... వీడెవడో చూడుండ్లి...''

నోరు మూస్తూ... నర్సింలు ఆమెను పట్టుకుని...

ఎవరూ వింటున్నట్టు లేదు. మనుషులు సంఘజీవులుగా బ్రతుకుతున్న సమాజంలో వీధిలో మానభంగం జరుగబోతుంటే ఎవరూ ప్రతిఘటించేందుకు సాహసం చేయలేక... భయం... భయం... మనుషుల్లో భయం... మనకెందుకులే అన్న ఉదాసీనత.

లచ్చమ్మ ఇంటి కిటికీ దగ్గర నిలబడి అరుస్తోంది. తలుపులను దబదబ బాదుతోంది.

"వాడు ముందే ఎరుకలోడు. మనకెందుకు. గూడెమంత ఉర్కస్తది. ఊర్కో'' అని లచ్చమ్మ మొగనితో చెబుతూ,.... విన్నది పార్వతి.

ఇంకో ఇల్లు... ఇంకో ఇల్లు...

వర్షం కురుస్తూనే ఉంది.

వీధిలో పరుగు... వీధిలో వేట... మనుషుల మధ్యనే అఘాయిత్యం.

లాభంలేదు. ఎవరో వస్తారనీ, రక్షిస్తారనీ, ఆదుకుంటూరనీ అరవడం.... ఉత్త దండుగ.

పార్వతి పరుగెత్తడం ఆపి... నిలబడి.... ప్రక్కనే ఉన్న కంకరరాళ్ళ కుప్పనుండి రెండు రాళ్ళందుకుంది.

ఒకటే చూపు.... ఒకటే దీక్ష.. ఒకటే కసి...

రాయిని తుపాకీ గుండులా విసిరింది.

నర్సింలు తలపగిలి.... నిశ్శబ్దంగానే కుప్పకూలి లైటు వెలుగులో ఎర్రగా రక్తం కారి వర్షం నీటిలో కలువడం కనబడుతోంది.

పార్వతి నడుస్తూ వెళ్ళి...ఇంట్లో లోపలివైపు నుండి గడియ వేసుకుంది.

వర్షం కురుస్తూనే ఉంది నిశ్శబ్దంగా.

★ ★ ★

పార్వతి కళ్ళనిండా నీళ్ళు... కురుస్తున్నాయి ధారలుగా.

ప్రక్కన నిద్రలో బిడ్డ,

అటు మత్తులో, నిద్రలో, చావులాంటి మూర్ఛలో తండ్రి...

గుండెల నిండా అగ్నిపర్వతం-

కసి.... కసి.... కసి-

ఎవరిమీద... ఎంత అరచినా పట్టించుకోని చుట్టున్న మనుషుల మీద. మనిషిని మనిషి ఆదుకోని ఈ జాతి మీద... ఈ స్థితికి మూలకారకుడైన పేరుకు మాత్రమే నిలిచిన భర్త మీద... చివరికి తనమీద తనకే కసి-

బయట వర్షం ఆగలేదు. చప్పుడు వినబడుతూనే ఉంది.

ఏమిటి చేయాలిప్పుడు తను. రేపు ఏం జరుగుతుంది. ఎక్కడ రక్షణ లభిస్తుంది తనకు.

ఎంత రాత్రయిందో... పదకొండు దాటిందా.

బయట ఏదో జీపువంటిది ఆగిన చప్పుడు. ఎవరికోసం వచ్చింది ... గుండె దడదడా.

తలుపులపై కర్రతో కొడ్తున్న చప్పుడు. తమ ఇంటి తలుపుల పైననే.

"ఎవరు లోపల... తలుపుతీయ్" కరుకుగా కంఠం.

ఎవరై ఉంటారు.

కిటికీలో నుండి చూచింది. ఖాకీ బట్టలు... పోలీసు.

తలుపు తెరిచింది అప్రయత్నంగానే.

"నువ్వేనా పార్వతి"

తలూపింది నోటమాట రాక.

"నడు జీపెక్కు"

"ఎం..ఎందు...కు"

"నువ్వు నడుముందు. తర్వాత చెప్త"

"నా బిడ్డ... ఈ రాత్రి..."

"నడువమంటాంటే..." చేయిపట్టి గుంజి జీవు దిక్కునెట్టి- బలవంతంగా జీపులో కెక్కించి..

"నా బిడ్డ, నా అయ్యా... అయ్యో.... అయ్యో.."

జీపు చప్పుడులో ఆమె కేకలు కలిసిపోయి,

పోలీస్‌స్టేషన్ ముందు...

వర్షంలో-జీపు నుండి దిగి... పోలీసులతో లోపలికి లాక్కుపోబడి...

ఎదురుగా ఇన్‌స్పెక్టర్... అటు ప్రక్కన నుదుట రక్తంతో నర్సింలు-

"ఏమే... (లంజా...)... వీడు నీ మొగడుకదా.. మొగున్ని ఈ రకంగా కొడ్తావ్.."

వీడు నా మొగడా.. మెదడునిండా కోటి బాంబులు ప్రేలుతున్నట్టనిపించి,

"వీడు నా మొగడెట్టయితడు సార్"

"అంటాండు గద వాడు"

"అంటే ఐతడా సార్"

"ఐతడు. ఇప్పుడు నేను కూడంటాన వీడే నీ మొగుడు. మొగనితోని మంచిగ పండ్కోని సంసారం చేస్కోక ఏం రోగమే నీకు. సల్లగ వాన పడ్తాంది... పోండ్లి... ఇంటికిపోయి పెండ్లాం మొగల్లోలె ఉంటరా..?"

"నాకేం అర్ధమైతలేదు సార్"

"లేచి అర్థం చేయించాల్నా. చూస్తే భలే జోరుగున్నవే. ఏంరా... నర్సింలూ బాగున్నదిరో నీ పెండ్లాం"

"బాగనే ఉంటద్దొరా"

"మరి నన్ను కూడా చూడమంటావ్ ఓసారి"

"మీ ఇష్టం దొరా"

"ఏమే"

ఏడుస్తున్నది పార్వతి గుండలవిసేలా. బోనులో చిక్కిన ఎలుకకంటే హీనమైన స్థితిలో ఉన్నట్టనిపించి.,

"పోండ్లి ఇడ్చి పెడ్తాన. మల్ల ఈ కేసు నాదగ్గర కొచ్చిందంటే... ఏమే... వీడే నీ మొగడు. మంచిగ చూస్కో... ఆడదానికి వెంట ఉండి మంచిచెడ్డలు అన్ని ఎవడు అర్సుకుంటడో వాడే మొగడు ఇన్నవా... పో..."

"వస్తం దొరా... పావే" నర్సింలు ఇన్‌స్పెక్టర్‌కు దండంపెట్టి ఆమె చేయిపట్టుకుని బయటకు నడిపించుకొస్తూ,

"ఏయ్ రిక్షా" అని పిలిచాడు.

ఆమె అవాక్కయి వర్షంలో నిలబడి- రిక్షా రావడం, రిక్షాలో ఎక్కడం, రిక్షా కదలడం...

కాస్త తెప్పరిల్లే సరికి రిక్షాలో ప్రక్కన ఒరిగి కూర్చున్న నర్సింలు చంకల క్రింది నుండి చేతులుపోనిచ్చి, చెంపలపై పెదవులానించి...

ఛీఛీ... అయ్యో భగవంతుడా... చేతులతో నెట్టింది వాన్ని. రిక్షా ఉగిపోయింది తోపుకు.

"సరిగ్గా కూర్చోండమ్మా బండి పడిపొద్ది" రిక్షా వాని సణుగుడు. కిర్రుకిర్రుమని చప్పుడు.

ఒంటినిండా తొండలు, తేళ్ళు పాకుతున్నట్లు వికృతమైన భావన కలవరపరచి ఆమె కళ్ళు మూసుకుంది.

రిక్షా ఇంటి ముందాగగానే... మెరుపులా దిగి లోపలికురికి గడియపెట్టుకుని... అదిరిపోతూ...

రిక్షాను పంపించి... నర్సింలు కిటికీ దగ్గరగా వచ్చి నిలబడి "ఏం ఫర్వాలేదే కొత్త పెండ్లామా... నిన్ను విడిచి పెట్ట. నీ దెబ్బ అవస్థ పెడ్తాంది... ఇగ నిన్నెవ్వడాదుకుంటడో చూస్త. తెల్లారనీ... బజార్లనే నిన్ను... చేయకుంటే నా పేరు నర్సింలుగాదు..."

దూరమౌతున్న అడుగుల చప్పుడు.

తలెత్తి చూచింది. ఎదురుగా లేచి కూర్చుని తననే భయంగా చూస్తున్న బిడ్డ.. వెళ్ళి గుండెలకదుముకుని బావురుమని ఏడ్చింది.

★ ★ ★

బస్సుదిగి, సంచీని ఒక చేత్తో పట్టుకుని కూతురిని మరో చేతితో నడిపించుకుంటూ....

ఆ యింటి గుమ్మంముందు ఆగింది పార్వతి.

ముందు గదిలో కూర్చుని తాడుపేనుకుంటున్న భర్త అన్న తలెత్తి చూచి "ఇప్పుడే వస్తానవా" అన్నాడు.

"ఊ..." బావురుమని ఏడ్వాలనిపించింది.. కాని

"లోపలికి పో"

నడిచింది లోపలికి.

వంటగదిలో తోడికోడలు ఏదో తరుగుతోంది. పార్వతిని చూచి పెద్ద ఆసక్తేమీ చూపించకుండానే "కూర్చో" అంది.

రెండుమూడు నిముషాలు గడిచాయి.

"నీ మొగుడు ఉత్తరం రాసిండట... గా సదువురాని దానితోటి నాకు సంసారమేంది.. ఎవరన్న కాస్త సదువుకోని మొకం తెలివున్న పిల్లను పెండ్లిచేసుకుంట అని రాసిండట. నాల్గు పైసలు కనిపిస్తానైగద ఒళ్ళు ములములమంటాందో ఏమో"

"ఎవరికి రాసిండు ఉత్తరం"

"వాళ్ళ స్నేహితుడు లేదా ఈ ఊల్లె... హన్మంతు. వానికి. వాని పెండ్లాం చెప్పింది నాకు మొన్న."

చటుక్కున కూతురు యొక్క అమాయకమైన ముఖంలోకి చూచింది పార్వతి.

సముద్రంలో పడిపోయి చేతికి ఏదీ దొరకక బలవంతంగా మునిగి పోతున్నట్టనిపించి,

"ఎటన్న పోవుకుంట ఇటచ్చినవా.. లేకుంటే మా ఇంటికే వచ్చినవా ప్రత్యేకంగా"

పార్వతి షాక్ తింది. అసహాయమైన తన స్థితి.... ఒంటరి బతుకు.... ఎంత లోకువైంది తను.

"చాన్నాల్లయింది గదా ఓసారి చూచిపోదామని..."

"ఉహూ..."

ఆదరణలేని చోట ఉండవలసిన అగత్యం ప్రాప్తం మనిషికి ఎంత దుర్భరంగా ఉంటుందో మొట్టమొదటిసారిగా అర్థమైంది పార్వతికి జీవితంలో.

కాని తప్పదు.. అటు నుయ్యి... ఇటు గొయ్యి... నుయ్యి కన్న గొయ్యే మేలు.

దుఃఖాన్ని దిగమ్రింగుకుని.. రాయిలా,

★ ★ ★

వారం గడిచిన తర్వాత,

"కోన్ హై అందర్...." అని దర్వాజాపై కర్రతో కొట్టిన చప్పుడై

అదిరిపడి ఇంటి వెనుక నుండి ఓ చూపు విసిరింది పార్వతి.

పోలీస్... ఖాకీ బట్టల వాసన.

బావ వెళ్తున్నాడు ముందు గదిలోకి.

"పార్వతీ కోన్ హై"

"ఎందుకు"

"వరంగల్ పోలీస్ స్టేషన్‌ల కేస్ ఉందీ ఆమెపై. మాకు మత్‌లబ్ చేసినార్. ఉసే లేజానాహై. బులావ్"

పార్వతి ఒంటినిండా చెమట. భయం... వణుకుతోంది.

"ఏం కేస్"

"ఆమె మొగుడ్ పెట్టినాడ్ కేస్"

"మొగుడెవరు"

"అరే... మాకూ ఏం తెలుసువయా... పంపుతావా... నీకీ కూడా తీస్కపొమ్మంటవా"

"ఆ... రమ్మంటాను..." అతను వెనుదిరిగి...

పార్వతి ఉన్నపలంగా కూతురును వెంటదీసుకుని బయటికి వస్తూ,

"నువ్వేనా... ఛలో..."

అప్పటికే బయట జనం మూగుతున్నారు.

"మొగుడెవరే" వెనుకనుండి బావ కంఠం... భార్య నడుగుతున్నట్టున్నాడు.

"ఎవడో... ఎవనికి మరిగిందో ఏం పాడో... నేననుకుంటనే ఉన్న... దాని అందం మంట్లెకల్సి పోను..." తోడికోడలు మాటలు విని బాగున్నాయి.

ముందు ఇద్దరు పోలీసులు.. వెనుక పార్వతి, ప్రక్కన పాప. ఆ అన్యాయం వెనుక ఏ నేపథ్యగీతాలూ వినబడ్డంలేదు. ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు మౌనంగా మరుగుతున్నాయి.

★ ★ ★

"అయ్యా.... సార్... వీడు నాకు సార తాగించి తాగించి నా బిడ్డను అన్యాయం చేయాలనుకున్నడ్సార్. వీడుదాని మొగడు కాదు. ఒట్టి దొంగముండా కొడుకు. రచ్చిండ్సార్ నా బిడ్డను..." ముసలోడు మొత్తుకుంటున్నాడు.

"అరే... వీన్ని లోపలేసెయ్యిరా..."

"నన్నేమన్నా చెయ్యండి. కాని నా బిడ్డనిడ్చిపెట్టుండ్లి"

పోలీస్ స్టేషన్ పాముల పుట్టలా గంభీరంగా, నిశ్శబ్దంగా ఉంది.

పార్వతి మౌనంగా నిలబడి వింటోంది తలవంచుకుని. ముందర పసిపిల్ల అర్థంకాని ప్రపంచాన్ని ఆశ్చర్యంగా చూస్తోంది.

ముసలి కోటయ్యను లాక్కెళ్తోంటే చేసే ఆక్రందన మెల్లమెల్లగా సన్నబడి, దూరమౌతోంది.

"తీస్కపోర నీ పెండ్లాన్ని" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నర్సింలునుద్దేశించి-

ఆమెకు అన్నీ జ్ఞాపకమొస్తున్నాయి... తను తమ ఇంటి చుట్టు ప్రక్కలున్న పెద్ద మనుషులనబడే వాళ్ళందరికి తన గోడు వినిపించడం, వాళ్ళు "ఆ పాడుముండకొడ్కుతో మేమెక్కడ పెట్టుకోగలమమ్మా... నీ దారేదో నువ్వే చూచుకో.." అనడం..,

ఒంటరి.... ఒంటరి... ఒంటరికి ఎప్పుడూ ప్రపంచం దూరమే.

నర్సింలు తను పెట్టిన ఐదువందల రూపాయల ఖర్చు ఎంత మాయాబజార్‌ను సృష్టిస్తోందో చూస్తూ నవ్వుకుంటున్నాడు.

పోలీస్‌స్టేషన్ నుండి ఇక కదలబోయే ముందు,

పార్వతి "ఐతే వీడే నా మొగడాసార్" అంది ఇన్‌స్పెక్టర్‌తో.

"ఊ"

"అని వీడు రాసిచ్చాడా మీకు"

"ఇదేంది కాగితం"

"అదివ్వండి నాకు"

"తీస్కపో"

చటుక్కున తీసుకుంది... నడవడం ప్రారంభించింది.

వెనుక నర్సింలు....

ఇన్‌స్పెక్టర్ రామ్‌కు

జేబులోనుండి డబ్బును తీసిస్తూ...

బయట మేఘాలు ఉరుముతున్నాయి. వర్షం వస్తుందేమో...

★ ★ ★

చీకటైై ఎంతసేపైందో,

పార్వతి గోడవార మోకాళ్ళ నడుమ తలదాచుకుని కూర్చుంది.

ప్రక్కన చింకిచాపపై కూతురు నిద్రపోయి...

ఎదురుగా గంటనుండి నర్సింలు అలాగే కూర్చుని ఉన్నాడు. తాగలేదు. అరవడం లేదు. పైపైబడి అఘాయిత్యమేదీ చేయలేదు.

"నీ మొగుడు ఎవడో చదువుకున్న దాన్ని చేసుకుంటాడట"

"భరించువాడు"... భరించుట అంటే... ఏండ్ల పర్యంతంతనను తనదారికి విడిచి- ఏ మాత్రం బాధ్యత తీసుకోకుండా...

డబ్బు... డబ్బు సంపాదించి... ఎవరికోసం డబ్బు... ఎందుకాడబ్బు.

డబ్బే జీవితమైతే.... ఈ ఎడబాటు, ఈ వెలితి, ఈ నగుబాట్లు, ఈ మానసిక నరకం... వీటి విలువ-

తన బలహీనతకోసం కూతురుని పట్టించుకోని తండ్రి,

అసహ్యించుకునే చుట్టాలు...

కనీసం మనిషిని మనిషిగానైనా ఆదుకోని సభ్య సమాజం.

లంచాలు తీసుకుని జీవితాలను చిదిమేసే ప్రభుత్వ వ్యవస్థ-

ఎదుట మాటువేసి కూర్చున్న పులి...

చేతిలో 'దొంగభర్త' చేవ్రాలున్న కాగితం....

"పార్వతీ... ఆడదానికి అండగా, చేనుకు కంచెలాగ కష్టసుఖాల్లో వెంట నీడలా ఉండేవాడు మొగడు. నీ మొగడు మొగడు కాదు. వానికి నీ మీదకన్నా డబ్బు మీదనే ప్రేముంది. నేను నిన్ను నిజంగా ప్రేమిస్తాన. నీ గురించి నీ నాయినను ఎన్నో వెల్లనించి మచ్చిక చేసుకున్న. నీ కోసం పోలీసోళ్ళతోని, ఈ చుట్టూ ఉన్న మనుషులతోని రోజులకొద్దీ పోరాడిన. నీతోని దెబ్బలు తిన్న. ఏం జరిగినా నిన్ను విడిచిపెట్టలేదు. నిజంగా నువ్వు నాకు కావాలని లేకుంటే గింత చేస్తనా నువ్వే ఆలోచించు. నిన్ను పూవోలె్గ చూచుకుంట. బలహీనుని చాటున భయపడుతూ బ్రతకడంకన్న ఎదిరించి తలెత్తుకుని బ్రతుకు... నా భార్యవైతే తప్పేమిటి..."

పార్వతి చటుక్కున తలెత్తి చూచింది నర్సింలు వంక.

.... తప్పేమిటి...?

తప్పేమిటి....? తప్పేమిటి...?

తప్పేమీ లేదు అన్న నిర్ణయానికి వస్తోందామె.

'ఉదయం' వారపత్రిక
18 జూన్ 1987